


# మారుతి కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..

## 2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

**మారుతి ఈ-విటారా:**

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**నయా గ్రాండ్ విటారా**

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి వీధంగా డిజైన్ చేసింది.

**కొత్త బాలెనో**

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

**అప్‌గ్రేడ్ బ్రెజ్జా**

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

# పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

### ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
### స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
### కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంభిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**ఇదీ సంగతి..**

సహజంగా రాష్ర్టాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతే కాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

**కేసులతో రచ్చ**

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్థాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

### ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరి కొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# టెలికం సంస్థలకు ఇక్కట్లే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.




**శాట్కామ్‌ల ఎంట్రీతో..**

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

# ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై,



కోల్‌కతా, పుణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

## ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

## రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్‌ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

## తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

- జగిత్యాల ఆర్డీవో, వయో వృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ మధుసూదన్



కొడుకులు, కోడళ్లను విచారిస్తున్న ఆర్డీవో మధుసూదన్

జగిత్యాల టౌన్, డిసెంబర్ 28: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, విస్మరిస్తే శిక్షార్హులేనని జగిత్యాల ఆర్డీవో, వయో వృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ మధుసూదన్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీవో చాంబర్‌లో శనివారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద నమోదైన కేసుల్లో కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు ఆర్డీవో ట్రిబ్యునల్ కోర్టు ముందు విచారణకు హాజరయ్యారు. విచారణలో బుగ్గారం మండలం బుగ్గారం గ్రామానికి చెందిన కళ్లెం చిన్నన్న, గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన బోయపోతు రాజయ్య, జగిత్యాల పట్టణానికి చెందిన ఇల్లెందుల భాగ్యమ్మ, జగిత్యాల అర్బన్ మండలం దరూర్ గ్రామానికి చెందిన మారవేణి గంగవ్వ ఫిర్యాదు చేయగా, వారి కొడుకులు, కూతుళ్లు, కోడళ్లను ఆర్డీవో పిలిపించి విచారించారు. తమ కొడుకుల నుంచి పోషణ, వైద్య ఖర్చులు ఇప్పించాలనే కేసుల్లో ఆ వృద్ధుల తరపున తెలంగాణ సీనియర్ సిటీజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తన వాదనలు ఆర్డీవోకు వినిపించారు. అనంతరం కొడుకులు, కోడళ్లకు ఆర్డీవో కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, సంరక్షణ చట్టం 2007, సెక్షన్ 24 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించక, వేధింపులకు గురిచేస్తున్న వారికి నోటీసులు ఇచ్చినా విచారణకు హాజరు కాని, తీర్పును పాటించని వారికి 6 నెలల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో తఫాజుల్ హుస్సేన్, సీనియర్ సిటీజన్స్ ఫోరం ప్రతినిధులు వెల్ముల ప్రకాశ్‌రావు, గౌరిశెట్టి విశ్వనాథం, సీనియర్ సహాయకురాలు పద్మజ, ఎఫ్‌ఆర్‌వో కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాలకు ఇసుక రీచ్‌ల ఇసుకనే వాడాలి

జగిత్యాల, డిసెంబర్ 28: జిల్లాలో నిర్మాణ అవసరాలకు ఇసుక రీచ్‌ల నుంచి తీసిన ఇసుకను మాత్రమే వాడాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్మాణ అవసరాల కోసం అందుబాటు ధరలో ఇసుకను సరఫరా చేయడానికి కలెక్టర్ అధ్యక్షతన రాయికల్ మండలం ఇటిక్యాల, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్, కోరుట్ల మండలం పైడిమడుగు, కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ఇసుక రీచ్‌లను గుర్తించామన్నారు. ప్రజలకు అవసరాల నిమిత్తం ఇసుకను సరఫరా చేయడానికి ట్రాక్టర్ (3) క్యూబిక్ మీటర్లకు గానూ రూ.800గా నిర్ణయించారు. ప్రజలు అవసరాల నిమిత్తం సంబంధిత తహసీల్దార్లను సంప్రదించి ఒక ట్రాక్టర్ (3) క్యూబిక్ మీటర్లకు రూ. 800 డీడీ రూపంలో చెల్లించి తగిన అనుమతులు పొంది ఇసుక రవాణా చేసుకోవాలని సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేయాలని, సెలవు దినాల్లో రవాణా చేయవద్దన్నారు. ట్రాక్టర్ల యజమానులు నిబంధనల మేరకు రవాణా చేయాలని, అక్రమంగా తరలిస్తూ మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు వెల్ది విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, డిసెంబర్ 28 : జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థి బి.హర్షవర్ధన్ ఎంపికయ్యారు. రగ్బీ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన హర్షవర్ధన్ మానకొండూర్ మండలం వెల్ది గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి అంతర్‌పాఠశాలల క్రీడా పోటీలు మహబూబ్‌నగర్‌లో ఇటీవల జరుగగా, రగ్బీ క్రీడలో జిల్లా జట్టు నుంచి పాల్గొని, అత్యద్భుతంగా రాణించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ. ఎండీ ఉన్నీష్‌పాషా తెలిపారు. కాగా, హర్షవర్ధన్ ఎంపికపై జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, హెచ్‌ఎం ఆర్.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

# కదం తొక్కిన జీపీ కార్మికులు

- పెండింగ్ వేతనాల కోసం పోరుబాట
- కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

కలెక్టరేట్, డిసెంబర్ 28: పంచాయతీ కార్మికులు కదం తొక్కారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ, శనివారం కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికులతో కలిసి భారీ ధర్నా చేశారు. అనంతరం అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ ) జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు నెల నెలా వేతనాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం, సంవత్సరంలో రెండు, మూడు సార్లు మాత్రమే చెల్లించడంతో తిండి గింజలకు కూడా తిప్పలు పడే పరిస్థితి వచ్చిందని వాపోయారు. అధికారంలోకి వస్తే జీపీ కార్మికులకు కనీస వేతనాలను రూ.18 వేలకు పెంతామని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్, 10 లక్షల హెల్త్ కార్డులు ఇస్తామని, ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్, ఏడాది గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నదని మండిపడ్డారు. జీపీలకు నిధులు లేవని, సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి కార్మికుల బతుకులు ఆగమయ్యాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని, లేదంటే జనవరి 4న నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్, జీపీ మండల అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్, అక్కల అంజాగౌడ్, వర్కోలు మల్లయ్య, నరపురం నర్సయ్య, లోకిని శ్రీనివాస్, న్యాత నర్సయ్య, బెజుగం రాజశేఖర్, ముదుగం అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టుకూ సాగు నీరందించాలి



ముస్తాబాద్‌లో మానేరు కాల్వ వద్ద ఆందోళ చేస్తున్న రైతులు

ముస్తాబాద్, డిసెంబర్ 28: ఎగువ మానేరు నీటిని చివరి ఆయకట్టుకూ అందించాలని ముస్తాబాద్‌లో మానేరు కాలువ వద్ద శనివారం శీలం స్వామి ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. మానేరు నీటిని మొదట చివరి ఆయకట్టుకు వరకు విడుదల చేస్తామని, అనంతరం ముస్తాబాద్ వరకు అందిస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలుపడంతో రైతులు నార్లు పోసుకున్నారని చెప్పారు. నాటు వేసే సమయానికి పోతుగల్ తూం వరకు మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టు వరకూ విడుదల చేయకపోతే రైతుల బతుకు ఆగమైతుందన్నారు. అధికారులు స్పందించి కాల్వలో పేరుక పోయిన చెత్త చెదారాన్ని తొలగించి తెర్లుమద్ది చివరి ఆయకట్టు వరకూ నీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు బైతి నవీన్, పుప్పాల రమేశ్, బండి శ్రీను, దబ్బెడ రవి, సుంచు గణేశ్, బండి మహేశ్, బాలయ్య, శేఖర్, హరీశ్ ఉన్నారు.

# భూసార పరిరక్షణకు నానో ఎరువులు దోహదం

మానకొండూర్, డిసెంబర్ 28: ఇఫ్కో నూతన నానో ఎరువుల వినియోగంతో సమయం ఆదాతో పాటు రైతులకు భూసార పరిరక్షణ, వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పాదకత, నాణ్యత మెరుగు పడుతుందని భారతీయ బీజ్ సహకార సమితి చైర్మన్, ఇఫ్కో మార్కెటింగ్ డైరెక్టర్ యోగేంద్ర కుమార్ పేర్కొన్నారు. శనివారం మానకొండూర్ మండల కేంద్రంలో నానో ఎరువుల వినియోగంపై ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ఇఫ్కో మార్కెటింగ్ డైరెక్టర్ యోగేంద్ర కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఇఫ్కో సంస్థ ఉత్పత్తులైన నానో యూరియా, నానో డీఏపీ, ఇఫ్కో జీవ ఎరువులు, ఇఫ్కో బయో డీ కంపోజర్, ఇఫ్కోజీవ ఉత్పదకాలు తదితర ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు మాట్లాడుతూ, నిర్దేశించిన సహకార సంఘాల్లో రైతులకు నానో ఎరువులు, డ్రోన్ సేవలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## తప్పుడు పత్రాలు సృష్టించి.. భూమి కాజేసి

- నలుగురిపై కేసు నమోదు • ప్రధాన నిందితుడి అరెస్ట్

రాంనగర్, డిసెంబర్ 29 : తప్పుడు పత్రాలు సృష్టించి భూమి కాజేసిన ఘటనలో శనివారం నలుగురిపై కేసు నమోదు చేసి, ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి ఎస్‌ఐ సాంబమూర్తి వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రేకుర్తి రెవెన్యూ శివారు సర్వే నెంబర్ 74లో పూర్తి విస్తీర్ణం 1-01 ఎకరాల భూమిని అబ్దుల్లా బిన్ ముసల్లం వారసుల వద్ద నుంచి 1992లో హైదరాబాద్, నాంపల్లి అఘాపురాకి చెందిన షేక్ హసన్ తల్లి షేక్‌అలిమా పేరిట సేల్ డీడ్ నెంబర్ 727/1992 ద్వారా కొనుగులు చేశారు. అప్పటి నుంచి భూమి వారి స్వాధీనంలో ఉంది. అందులో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టలేదని, భూమిని మ్యుటేషన్ చేయించుకుని, పట్టా పాస్ బుక్ తీసుకొని తమ పేరిట మార్పిడి చేసుకుందామని ఆన్‌లైన్ సెంటర్‌కి వెళ్లి ఈసీ తీశారు. అయితే, సర్వే నెంబర్ 74లో వేరే వారి పేర్లు కనిపించాయి. అందులో కరీంనగర్ కమాన్ రోడ్‌కి చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ అతని కొడుకు షేక్ అబ్దుల్లా రోషన్ పేరుపై ఎనిమిది డాక్యుమెంట్ల ద్వారా గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2024 జనవరి 29న రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఈసీలో వచ్చింది. ఆ తర్వాత వివరాలు తెలుసుకోగా షేక్ అబ్దుల్ అజీజ్ మొత్తం 1.01 ఎకరాల భూమిని దురుద్దేశంతో తప్పుడు పద్ధతిలో ఎనిమిది భాగాలుగా విభజించి, మున్సిపల్ కార్యాలయం నుంచి సెల్ఫ్ అసిస్మెంట్‌లో ఎనిమిది దొంగ ఇంటి నంబర్లు తీసుకున్నాడు. సదరు ఇంటి నంబర్లకు పన్ను చెల్లించి ఆ రసీదు ఆధారంతో మోఖాపై ఎలాంటి కట్టడాలు లేకున్నా ఒక్కో డాక్యుమెంట్‌లో 100 గజాల స్థలంలో రేకుల షెడ్లు ఉన్నట్లు తప్పుడు ఫొటోలతో మా భూమిని కాజేయాలని తన కొడుకు పేరిట ఏడు గిఫ్ట్ డీడ్, ఒకటి సేల్ డీడ్ దస్తావేజులు చేయించాడు. బాధితుడు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడైన కరీంనగర్ కమాన్‌రోడ్ కి చెందిన షేక్ అబ్దుల్ అజీజ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచగా, మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. దీంతో కరీంనగర్ జైలుకు తరలించారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన డీఈ

- 'నమస్తే' కథనానికి స్పందన



రైతులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి

కొడిమ్యాల, డిసెంబర్ 28: కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి పరిశీలించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శనివారం 'పంటలు ఎండిపోతున్నాయి.. పట్టించుకోరా' శీర్షికన కథనం ప్రచురితమైంది. కాగా, స్పందించిన ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి వచ్చి రైతులతో మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో బ్రేకర్‌ను విప్పి బ్రేక్ డౌన్ కాకుండా సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్రేక్ డౌన్ సమస్య రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రఘునాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 31న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, డిసెంబర్ 28: వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీని ఈ నెల 31న లెక్కించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు లెక్కింపు మొదలవుతుందని పేర్కొన్నారు.